క్లుప్తంగా

నేడు చెన్నూర్‌కు మంత్రి రాక

చెన్నూర్: చెన్నూర్‌కు కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్‌వెంకటస్వామి రానున్నట్లు అధికారులు తెలిపారు. చెన్నూర్ మండలం ఎల్లక్కపేటలో గల బీఎంఆర్ ఫంక్షన్ హాల్లో బ్యాంక్ లింకేజీ, వడ్డీ లేని రుణాలను ఆదివారం మధ్యాహ్నం 2గంటలకు మంత్రి చేతుల మీదుగా అదజేయనున్నట్లు ఏపీఎం ప్రమీల తెలిపారు. అనంతరం చెన్నూర్, కోటపల్లి, భీమారం మండలాలకు చెందిన లబ్ధిదారులకు కొత్త రేషన్ కార్డుల అందజేస్తారని పేర్కొన్నారు. కార్యక్రమానికి అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

గిరిజన ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేసిన ఆర్డీవో


భోజనాన్ని పరిశీలిస్తున్న ఆర్డీవో, ఎంఈవో

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని ప్రభుత్వ గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలను శనివారం ఆర్డీవో హరికృష్ణ, మండల విద్యాశాఖ అధికారి జె.పోచయ్యతో ఆకస్మికంగా సందర్శించారు. ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను ఆర్డీవో అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల కోసం తయారు చేసిన భోజనం నాణ్యతను పరిశీలించి, మెనూ ప్రకారం పోషక విలువలు ఉన్న భోజనం పెట్టాలని, తాజా కూరగాయలు, నిత్యావసర వస్తువులను ఉపయోగించాలని ఆదేశించారు. తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులతో ప్రత్యేకంగా మాట్లాడారు. తిరిగి వారం రోజుల్లో మరోసారి ఆశ్రమ పాఠశాలకు వస్తానని, అప్పటి వరకు ఏమైనా లోపాలు ఉంటే సరిచేసుకోవాలని సూచించారు.

ముగిసిన పోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు

వేమనపల్లి: మండల కేంద్రంలోని బెస్తవాడలో ఊరపోచమ్మ విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు శనివారంతో ముగిశాయి. పూజలు, హోమాలు నిర్వహించి నూతన విగ్రహాలు ఊరేగింపుగా తీసుకొచ్చి ఆలయంలో ప్రతిష్ఠించారు.అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకుడు కార్తీక్‌శర్మ, విగ్రహ దాత పోరెడ్డి రాకేష్‌రెడ్డి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు వేణుమాధవ్, మాజీ ఎంపీపీ కుర్రుం వెంకటేషం, మాజీ సర్పంచ్‌లు తోకల రాంచంద్రం, మధుకర్ పాల్గొన్నారు.

ఎస్టీయూ సభ్యత్వ నమోదు

తాండూర్: మండలంలోని తంగళ్లపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం(ఎస్టీయూ) సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు బట్టూరి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలన్నారు. విద్యారంగ ఉపాధ్యాయ సమస్యల సాధనకు ఎస్టీయూ అలుపెరగని కృషి చేస్తుందన్నారు. అనంతరం మండల విద్యాధికారి మల్లేశం మాట్లాడుతూ.. సాధ్యమైనంత త్వరలో ఉపాధ్యాయ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామన్నారు.

పెండింగ్ వేతనాలు చెల్లించాలి

మంచిర్యాలటౌన్: జిల్లాలోని ప్రీమెట్రిక్ హాస్టల్ ఔట్‌సోర్సింగ్ వర్కర్స్‌కు ప్రభుత్వం ఏడు నెలలుగా వేతనాలు ఇవ్వడం లేదని, వెంటనే చెల్లించేలా చూడాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ దుర్గాప్రసాద్‌కు శనివారం ఇఫ్టూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. భారత కార్మిక సంఘాల సమాఖ్య(ఇఫ్టూ) జిల్లా ప్రధాన కార్యదర్శి డి.బ్రహ్మానందం మాట్లాడుతూ నెలల తరబడి వేతనాలు చెల్లించకపోవడంతో దళిత అభివృద్ధి శాఖ ప్రీమెట్రిక్ హాస్టల్‌లో పనిచేసే వాచ్‌మెన్‌లు, కామటి, కుక్, ఔట్‌సోర్సింగ్ వర్కర్స్ ఆర్థికంగా ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. ఏజెన్సీ అకౌంట్‌లో బిల్లులను జమ చేయకుండా, నేరుగా కలెక్టర్ అకౌంట్ నుంచి ప్రతీ నెల చెల్లించేలా ప్రణాళిక రూపొందించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, రాజేశ్, లత, ప్రమీల, తిరుమల, రాజేశ్వరి, గంగ, రాజమ్మ పాల్గొన్నారు.

డిగ్రీ విద్యార్థులకు ఉపకార వేతనాలు

మంచిర్యాలఅర్బన్: ప్రధానమంత్రి ఉచిత శిక్ష ప్రోత్సహాన్‌యోజన ద్వారా ఇంటర్, తత్సమాన పరీక్షల్లో 80శాతంపైన మార్కులు సాధించిన డిగ్రీ విద్యార్థులకు మెరిట్ స్కాలర్‌షిప్ పొందటానికి అర్హులని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ చక్రపాణి తెలిపారు. కేంద్ర ప్రభుత్వం అందించే ఉపకార వేతనం డిగ్రీ విద్యార్థులకు మొదటి మూడు సంవత్సరాలకు రూ.12వేల చొప్పున, పీజీ విద్యార్థులకు 4, 5సంవత్సరాలల్లో ఇరవై వేల చొప్పున ఉపకారం వేతనంగా లభిస్తుందన్నారు. ఇతర ఏ స్కాలర్‌షిప్ పొందని విద్యార్థులు, తల్లిదండ్రుల ఆదాయం సంవత్సరానికి నాలుగున్నర లక్షల లోపు ఉన్న వారు అర్హులన్నారు. ఎంపికైన విద్యార్థులు ప్రతీ సంవత్సరం 50శాతంకు పైగా మార్కుల్ని సాధించాల్సి ఉంటుందన్నారు. పూర్తి వివరాలకు కళాశాలలో సంప్రదించాలన్నారు.


కాసిపేట: బోనాల వేడుకలో ఉపాధ్యాయులు, విద్యార్థులు


దండేపల్లి: వేడుకల్లో విద్యార్థులు, ఉపాధ్యాయినులు


నైవేద్యం సమర్పిస్తున్న కాసిపేట బాలుర గురుకుల పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు

ఘనంగా బోనాల సంబురాలు

మంచిర్యాలఅర్బన్/బెల్లంపల్లి/శ్రీరాంపూర్/కాసిపేట/మందమర్రిరూరల్/దండేపల్లి: విద్యాసంస్థల్లో ఆధ్యాత్మికత వెల్లి విరిసింది. ఆషాడమాసంలో ప్రత్యేకమైన బోనాల పండుగను శనివారం ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులు అట్టహాసంగా జరుపుకున్నారు. పోతరాజుల విన్యాసాలు, అమ్మవారి వేషధారణల్లో పిల్లలు ఆకట్టుకున్నారు. డప్పు చప్పుళ్లతో బోనమెత్తి అమ్మవారి వద్దకు వెళ్లి ప్రత్యేక పూజలు చేశారు. కాసిపేట ప్రభుత్వ సాంఘిక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల, మంచిర్యాల లక్ష్మీనగర్ శ్రీ చైతన్య పాఠశాలలో, నారాయణ పాఠశాలలో, శ్రీరాంపూర్‌లోని ఎయిమ్స్ స్కూల్లో, కాసిపేట మండలంలోని తెలంగాణ మోడల్ స్కూల్, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో, దండేపల్లి మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయంలో, మందమర్రి పట్టణం విద్యానగర్‌లోని ఎంపీపీఎస్(ప్రభుత్వ పాఠశాల)ల్లో వేడుకలు నిర్వహించారు. పిల్లలందరూ సంప్రదాయ పద్ధతిలో బోనాలు తీసుకెళ్లి అమ్మవారికి సమర్పించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.


నైవేద్యంతో అమ్మవారి దగ్గరకు వెళ్తున్న బాలికలు


శ్రీ చైతన్య పాఠశాలలో బోనాల సంబురాల్లో విద్యార్థులు


శ్రీరాంపూర్: బోనాలతో ఎయిమ్స్ విద్యార్థులు


నారాయణ పాఠశాలలో బోనాల సంబురాలు

నేడే మైసమ్మ తల్లి బోనాల జాతర


ఆలయం వద్ద ఏర్పాటు చేసిన బారికేడ్లు

మైసమ్మ తల్లి విగ్రహం

- బొక్కలగుట్ట ఆలయం వద్ద ఏర్పాట్లు పూర్తి
- హాజరు కానున్న మంత్రి వివేక్

రామకృష్ణాపూర్: మందమర్రి మండలం బొక్కలగుట్టలోని గాంధారి మైసమ్మ ఆలయం వద్ద ఆదివారం నిర్వహించనున్న ఆషాఢ మాస బోనాల జాతరకు ఆలయం ముస్తాబైంది. మందమర్రి మండలంతో పాటు చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు మైసమ్మ తల్లిని తమ ఇలవేల్పుగా భావిస్తారు. ఏటా నిర్వహించే ఈ జాతరకు పెద్ద సంఖ్యలోనే ప్రజలు విచ్చేసే అవకాశం ఉండటంతో భక్తుల సౌకర్యార్థం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తుల క్రమపద్ధతిలో అమ్మవారిని దర్శించుకునేందుకు వీలుగా ప్రత్యేకంగా క్యూలైన్లు ఏర్పాటు చేశారు. జిల్లా కేంద్రానికి అతి సమీపంలో జాతీయ రహదారి పక్కనే మైసమ్మ ఆలయం ఉండటంతో ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం ఏర్పడకుండా భారీ పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు. వాహనాలను నిలిపేందుకు ప్రత్యేకంగా పార్కింగ్ స్థలం కేటాయించారు. ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6గంటల వరకు జరుగనున్న ఈ జాతరలో రాష్ట్ర కార్మిక, గనుల శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామి పాల్గొననున్నారు. ఉదయం పాలవాగు వద్ద అమ్మవారికి ప్రత్యేక పూజలు చేసిన అనంతరం భక్తులు బోనాలు ఎత్తుకొని ఆలయ ప్రాంగణానికి ఊరేగింపుగా విచ్చేస్తారు. అనంతరం అమ్మవారికి భక్తులు ప్రత్యేక మొక్కులు చెల్లిస్తారు. మంచిర్యాల డీసీపీ భాస్కర్, బెల్లంపల్లి ఏసీపీ రవికుమార్, మందమర్రి సీఐ శశిధర్‌రెడ్డి బందోబస్తు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. సుమారు 250మంది సిబ్బందితో జాతరకు బందోబస్తు ఏర్పాటు చేస్తున్నారు.

నేరాల నియంత్రణకే కార్డన్ సెర్చ్


మాట్లాడుతున్న సీఐ రమణమూర్తి

జన్నారం: గ్రామాల్లో శాంతిభద్రతల పరిరక్షణకు, గంజాయి, మత్తు పదార్థాల నిర్మూలన, నేరాల నియంత్రణకే కార్డెన్ సెర్చ్ నిర్వహిస్తున్నట్లు లక్సెట్టిపేట సీఐ రమణమూర్తి పేర్కొన్నారు. మండలంలోని పొనకల్ గాంధీనగర్‌లో శనివారం ఉదయం సీఐ ఆధ్వర్యంలో కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సరైన ధృవ పత్రాలు లేని, నంబర్ ప్లేట్లు లేని 6 వాహనాలను పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. 100లీటర్ల ఇప్పపువ్వు, బెల్లం పానకం ధ్వంసం చేసి, పానకం పెట్టిన వ్యక్తి కోట ప్రకాశ్‌పై కేసు నమోదు చేశారు. శాంతి భద్రతలకు ప్రజలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో జన్నారం, దండేపల్లి, లక్సెట్టిపేట రెండో ఎస్సైలు అనూష, తహసీనోద్దీన్, రామన్నలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరిపై కేసు నమోదు

జన్నారం: ఇంటికి వచ్చి తలుపులు కొట్టి బెదిరించారనే ఫిర్యాదుతో ఇద్దరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై అనూష తెలిపారు. శనివారం ఎస్సై తెలిపిన కథనం ప్రకారం.. జన్నారం గ్రామానికి చెందిన మహ్మద్ ఫహీమోద్దీన్ ఇంటికి వెళ్లి తలుపులు కొట్టి అసభ్య పదజాలంతో దూషించారనే ఫిర్యాదుతో ముజీబోద్దీన్, ముక్తార్‌లపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

■ బొగ్గుబాయి వార్తలు

పనిముట్ల కొరత తీర్చాలి

శ్రీరాంపూర్: గనుల్లో కార్మికులు వినియోగించే పనిముట్ల కొరత తీర్చాలని ఐఎన్టీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఆ యూనియన్ శ్రీరాంపూర్ బ్రాంచ్ ఉపాధ్యక్షుడు జెట్టి శంకర్‌రావు శనివారం ఎస్ఆర్పీ 3 గనిని సందర్శించి కార్మికుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఆ యూనియన్ కేంద్ర కమిటీ నాయకులు స్వామి, తిరుపతి, రాజు, రవీందర్ రెడ్డి, జీవన్ జోయల్ నాయకులు పాల్గొన్నారు.

చెక్కు అందజేత

బెల్లంపల్లి: బెల్లంపల్లిలోని రాంజీగోండు విద్యార్థి నిలయ కమిటీకి రూ.3.73 లక్షల చెక్కును మందమర్రి ఏరియా సింగరేణి జనరల్ మేనేజర్ జి.దేవేందర్ అందజేశారు. మందమర్రి జీఎం కార్యాలయం కాన్ఫరెన్స్ హాల్లో శనివారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఏటా ఆనవాయితీ ప్రకారంగా పేద విద్యార్థుల చదువు కోసం సింగరేణి సీఎస్ఆర్ నిధుల నుంచి ఆ మొత్తాన్ని రాంజీగోండు ఆవాసం నిర్వాహక కమిటీ సభ్యులకు చెక్కు రూపంలో జీఎం ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో మందమర్రి ఏరియా పర్సనల్ మేనేజర్ శ్యామ్‌సుందర్, ఏఐటీయూసీ ఏరియా కార్యదర్శి సత్యనారాయణ, రాంజీగోండు విద్యార్థి నిలయం కమిటీ గౌరవ అధ్యక్షుడు విద్యాసాగర్ పాల్గొన్నారు.

'సింగరేణి కార్మికుల పక్షాన టీబీజీకేఎస్ పోరాటం'

కాసిపేట: తెలంగాణ బొగ్గు గని కార్మిక సంఘం కొప్పుల ఈశ్వర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీ తరుపున, కార్మికుల పక్షాన మరింత పోరాటం చేయనున్నట్లు టీబీజీకేఎస్ ఏరియా ఉపాధ్యక్షుడు మేడిపల్లి సంపత్ తెలిపారు. మందమర్రి ఏరియా కాసిపేట 2గని పై శనివారం బాయిబాట కార్యక్రమంలో భాగంగా కార్మికులతో మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. ఏరియా నాయకులు రమణ, శివ, కారుకూరి తిరుపతి, సారంగపాణి, ప్రతాప్, మస్కా రమేష్, రాజన్న, యాదగిరి, తిరుపతి, రాజ్‌కుమార్, ఇందూర్ శ్రీను, ప్రభాకర్, రాజేశ్, వెంకన్న, అర్జున్ తదితరులున్నారు.

'అక్రమ బదిలీలు నిలిపివేయాలి'

మందమర్రిరూరల్: సింగరేణిలో యాజమాన్యం అక్రమ బదిలీలు చేస్తూ ఉద్యోగులను భయభ్రాంతులకు గురిచేస్తుందని టీబీజీకేఎస్ కేంద్ర కమిటీ డిప్యూటీ జనరల్ సెక్రెటరీ రాజశేఖర్ శనివారం ఒక ప్రకటనలో ఆరోపించారు. వెంటనే అక్రమ బదిలీలను నిలిపివేయాలని, విజిలెన్స్ విచారణ పేరిట ఉద్యోగులపై వేధింపులు మానుకోవాలని, సంస్థకు నష్టం కలిగించే వారిపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


స్థానికులతో మాట్లాడుతున్న సుధాకర్‌నాయక్

తాండూర్: వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధులపై అధికారులు, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ సుధాకర్‌నాయక్ అన్నారు. మండలంలోని మాదారం–3 ఇంక్‌లైన్ గ్రామాన్ని శనివారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఇంటింటికి సర్వే నిర్వహించి, జ్వర పీడితుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రతను పాటించడం ద్వారానే వ్యాధులు ప్రబలకుండా చూడొచ్చు అన్నారు. పారిశుద్ధ్య నిర్వహణ క్రమం తప్పకుండా చేయించాలన్నారు. ఆయన వెంట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యురాలు ఝాన్సీ, సూపర్‌వైజర్ రమాదేవి, సిబ్బంది దౌలత్ స్రవంతి, పారిజాతం, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్ లేకుండా వ్యాపారం చేస్తే చర్యలు


వ్యాపారికి లైసెన్స్ ప్రతిని అందజేస్తున్న కమిషనర్

బెల్లంపల్లి: ట్రేడ్ లైసెన్స్ తీసుకోకుండా, పాత లైసెన్స్‌ను రెన్యూవల్ చేసుకోకుండా వ్యాపారాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని బెల్లంపల్లి మున్సిపల్ కమిషనర్ తన్నీరు రమేష్ అన్నారు. బజారు ఏరియాలో ఉన్న వర్తక దుకాణాలను శనివారం సందర్శించారు. పలువురి ట్రేడ్ లైసెన్స్‌ను రెన్యూవల్ చేసి, పాత బకాయిలు వసూలు చేసి రశీదులు అందజేశారు. కమిషనర్ వెంట మున్సిపల్ సిబ్బంది ఉన్నారు.

సంక్షిప్త వార్తలు

● కేజీబీవీలో ఇంటర్ స్పాట్ అడ్మిషన్లు

భీమిని: కన్నెపల్లి కేజీబీవీ బాలికల పాఠశాలలో ఇంటర్మీడియెట్ స్పాట్ అడ్మిషన్లు స్వీకరిస్తున్నట్లు కేజీబీవీ ప్రత్యేకాధికారి పద్మ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియెట్ బైపీసీలో 15సీట్లు ఖాళీగా ఉన్నాయని, పదో తరగతి ఉత్తీర్ణులైన బాలికలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

● కన్నెపల్లి ఎస్సైగా భాస్కర్‌రావు

భీమిని: కన్నెపల్లి పోలీస్‌స్టేషన్ ఎస్సైగా శనివారం భాస్కర్ రావు బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పని చేసిన ఎస్సై గంగారాం బదిలీపై దేవాపూర్‌కు వెళ్లగా ఆయన స్థానంలో భూపాలపల్లి సీసీఎస్‌లో పనిచేస్తున్న ఎస్సై భాస్కర్ రావు కన్నెపల్లికి బదిలీపై వచ్చారు.

● దాడి చేసిన వారిని శిక్షించాలని నిరసన

పాతమంచిర్యాల: బీసీ నాయకుడు తీన్మార్ మల్లన్నపై దాడి చేసిన వారిని చట్టప్రకారం శిక్షించాలని బీసీ సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. జిల్లా కేంద్రంలో శనివారం నిరసన ప్రదర్శన చేపట్టారు. బీసీ మేధావుల ఫోరం ఉమ్మడి జిల్లా కో ఆర్డినేటర్ కొండయ్య, సామాజిక న్యాయవేదిక కన్వీనర్ రంగు రాజేశం, బీసీ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు మల్లయ్య, సామాజిక ఉద్యమ నాయకులు పాల్గొన్నారు.

● విద్యాసంస్థల బంద్ విజయవంతం చేయండి

చెన్నూర్‌రూరల్: ప్రభుత్వ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని వామపక్షాల విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో ఈ నెల 23న చేపట్టిన విద్యాసంస్థల బంద్‌ను విజయవంతం చేయాలన్నారు. మండలంలోని కిష్టంపేట గ్రామంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు దాగం శ్రీకాంత్, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు రెడ్డి చరణ్, ఏఐఎస్‌బీ జిల్లా కార్యదర్శి సన్నీగౌడ్ మాట్లాడారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు రాహుల్, సుమంత్, రవితేజ, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● 'భూమి కబ్జా చేయలేదు'

నస్పూర్: తను కానీ, తన కుటుంబ సభ్యులు కానీ ఎవరి భూమి కబ్జా చేయలేదని, తమపై సౌమిత్రి శ్రీనివాసా చార్యుల వారసులు కొందరు, బీఆర్ఎస్ నాయకుడు బేర సత్యనారాయణ చేస్తున్న ఆరోపణలన్నీ అవాస్తవమని కాంగ్రెస్ నాయకుడు, సింగిల్ విండో డైరెక్టర్ ధర్ని మధూకర్ అన్నారు. శనివారం తన తండ్రి వెంకటేశం, సోదరుడు అశోక్‌తో కలిసి నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో మాట్లాడారు. ఆ భూమిని శ్రీనివాసా చార్యుల కుమారుడు సౌమిత్రి ఎంబాల చార్యుల వద్ద 2008లో కొనుగోలు చేసి, తన సోదరుడు ధర్ని అశోక్ పేరు మీద రిజిస్ట్రేషన్ చేయించుకున్నట్లు తెలిపారు. అధికారులు విచారణ జరిపి, ఎలాంటి చర్యలు తీసుకున్నా కట్టుబడి ఉంటామన్నారు. ఆరోపణలు మానుకోవాలన్నారు.

● 'అసత్య ప్రచారాలు చేస్తే ఊరుకోం'

జన్నారం: అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తూ నియోజకవర్గంలో పర్యటిస్తూ, ప్రజా సమస్యలను పరిష్కరిస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు పటేల్‌పై అసత్య ప్రచారాలు చేస్తే ఊరుకోమని ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షుడు సిడాం కాశీ, ఏఎంసీ డైరెక్టర్ సోనేరావు హెచ్చరించారు. ఎమ్మెల్యేపై సోషల్ మీడియా వేదికగా వస్తున్న ఆరోపణలను శనివారం వారు ఖండించారు. కాంగ్రెస్ పార్టీ ఎస్టీ సెల్ ఉపాధ్యక్షుడు హన్మంతరావు, నాయకులు దర్ముపటేల్, వసంత్ పాల్గొన్నారు.

● గోరింటాకు వేడుకలు

దండేపల్లి: ఆషాడమాసాన్ని పురస్కరించుకొని మండల కేంద్రంలోని పద్మశాలీ భవన్‌లో వెన్నెల గ్రామైఖ్య సంఘం ఆధ్వర్యంలో శనివారం గోరింటాకు వేడుకలు నిర్వహించారు. గోరింటాకు చెట్టుకు ప్రత్యేక పూజలు చేశారు. రోలులో సంప్రదాయ బద్ధంగా గోరింటాకును నూరి చేతులకు అలంకరించుకున్నారు. వీవో, మహిళ సంఘాల లీడర్లు, ఐకేపీ సిబ్బంది పాల్గొన్నారు.

● జాన్సన్‌నాయక్ చిత్రపటానికి క్షీరాభిషేకం

జన్నారం: ఖానాపూర్ నియోజకవర్గ బీఆర్ఎస్ ఇన్‌చార్జి భుక్య జాన్సన్‌నాయక్ నిర్వహించిన జాబ్‌మేళా ద్వారా వెయ్యి మంది యువకులు ఉద్యోగాలు పొందారని, అందులో జన్నారం మండల వాసులు సైతం ఉన్నారని బీఆర్ఎస్ మండల ఉపాధ్యక్షుడు జంగం సంతోష్ పేర్కొన్నారు. మండలంలోని కలమడుగులో శనివారం జాన్సన్ నాయక్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

● ఫార్మర్ రిజిస్ట్రీ నమోదు చేసుకోవాలి

నెన్నెల: డిజిటల్ పట్టా పాస్ బుక్ కలిగిన ప్రతి రైతు ఫార్మర్ రిజిస్ట్రీలో నమోదు చేసుకోవాలని ఏఈవో రాంచందర్ అన్నారు. మండలంలోని మన్నెగూడంలో శనివారం రైతులకు రిజిస్ట్రేషన్ విధానంపై అవగాహన కల్పించారు.

● రెండు రోజుల్లో నమోదు చేయాలి

వేమనపల్లి: పంచాయతీ అడ్వాన్స్‌మెంట్ ఇండెక్స్‌పై ఎంపీడీవో కార్యాలయంలో అధికారులతో సమావేశం నిర్వహించారు. పంచాయతీ కార్యదర్శులు రెండు రోజుల్లో సాధించిన ప్రగతిపై ఉన్న ప్రశ్నలు ఆయా అధికారుల సహకారంతో సంబంధిత పోర్టల్‌లో నమోదు చేయాలని ఎంపీడీవో కుమారస్వామి సూచించారు. కార్యక్రమంలో ఎంపీవో శ్రీనివాస్‌రెడ్డి, అన్ని శాఖల అధికారులు పాల్గొన్నారు.

● నూతన కార్యవర్గం ఎన్నిక

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలోని సరస్వతీ శిశు మందిర్‌లో శుక్రవారం రాత్రి భారతీయ మజ్దూర్ సంఘ్ జిల్లా కమిటీని జిల్లా అధ్యక్షుడు లగిశెట్టి కమలాకర్ ఆధ్వర్యంలో ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా కుంటాల శంకర్ ఎన్నికయ్యారు.

స్టార్ ఈఎంటీ అవార్డుకు ఎంపిక

మంచిర్యాలటౌన్: మంచిర్యాల 108అంబులెన్సు ఎమర్జెన్సీ మెడికల్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న సత్యనారాయణ మూడోసారి స్టార్ ఈఎంటీగా అవార్డును శనివారం అందుకున్నారు. రోగులను ఆసుపత్రికి చేర్చే క్రమంలో పేషెంట్లకు అత్యుత్తమ వైద్య సేవలు అందించినందుకు గాను రాష్ట్రవ్యాప్తంగా ఈఎంటీలకు ఇచ్చే స్టార్ ఈఎంటీ అవార్డుకు మూడోసారి ఎంపిక కావడంతో, అవార్డును ఉమ్మడి జిల్లా ప్రోగ్రాం మేనేజర్ సామ్రాట్, జిల్లా ఎగ్జిక్యూటివ్ సంపత్ అందించారు.

బంద్ విజయవంతం చేయండి

కాసిపేట: జీవో 49రద్దు చేయాలని ఈ నెల 21న తుడుందెబ్బ ఆధ్వర్యంలో తలపెట్టిన ఉమ్మడి జిల్లా బంద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆదివాసీ సంఘాల నాయకులు కోరారు. మండలంలోని దేవాపూర్‌లో శనివారం జిల్లా తుడుందెబ్బ ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. మంచిర్యాల జిల్లాలో కార్మికులు, వ్యాపారస్తులు, ప్రభుత్వ కార్యాలయాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు స్వచ్ఛందంగా బంద్ చేసి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆడ జంగు, జిల్లా గౌరవాధ్యక్షుడు పెంద్రం హన్మంతు, మండలాధ్యక్షుడు సంద్ర భూమయ్య తదితరులు పాల్గొన్నారు.

ఆశ్రమ పాఠశాల సందర్శన


వివరాలు తెలుసుకుంటున్న పురుషోత్తం నాయక్

కాసిపేట: మండలంలోని రేగులగూడ ఆశ్రమ పాఠశాలను శనివారం మండల ప్రత్యేకాధికారి పురుషోత్తంనాయక్ సందర్శించారు. విద్యార్థులకు కల్పిస్తున్న మౌలిక సదుపాయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులపై ప్రత్యేకమైన శ్రద్ధ వహించి నాణ్యమైన విద్య అందించాలని తెలిపారు. విద్యార్థులను ప్రశ్నలు అడిగి తెలుసుకున్నారు. వంటలు పరిశీలించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు లక్ష్మి, కొండు జనార్దన్, మండల పరిషత్ సీనియర్ అసిస్టెంట్ లక్ష్మినారాయణ ఉన్నారు.

మడేలేశ్వర స్వామి బోనాల జాతర

పాతమంచిర్యాల: జిల్లా కేంద్రంలో మడేలేశ్వర స్వామి బోనాల జాతర కార్యక్రమాన్ని రజక సంఘం ఆధ్వర్యంలో శనివారం ఘనంగా నిర్వహించారు. పూజలు నిర్వహించి, మొక్కులు చెల్లించుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ వైస్ చైర్మన్ శంకర్, కాంగ్రెస్ పట్టణ అధ్యక్షుడు తూముల నరేష్, రజక సంఘం నాయకులు పాల్గొన్నారు.


బోనాల ఊరేగింపులో భక్తులు

డిగ్రీ పట్టాల పంపిణీ


పట్టాల పంపిణీలో కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో పాల్గొన్న రఘునాథ్

మంచిర్యాలటౌన్: కేరళలోని ఐఐటీ పాలక్కడ్ కన్వోకేషన్ 2025 సందర్భంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్‌తో కలిసి శనివారం బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు రఘునాథ్ వెరబెల్లి డిగ్రీ పూర్తి చేసిన విద్యార్థులకు పట్టాలు అందించారు. ఐఐటీ పాలక్కడ్ బోర్డు మెంబర్‌గా రఘునాథ్ ఉండగా, ఈ ఏడాది డిగ్రీ పూర్తి చేసిన 300మంది విద్యార్థులకు పట్టాలను కేంద్రమంత్రితో కలిసి అందించారు.

ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

చెన్నూర్‌రూరల్: మండలంలోని ఆస్నాద గ్రామ సమీపంలో అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. శనివారం సుందరసాల నుంచి ఆస్నాదకు ఎలాంటి అనుమతులు లేకుండా ఇసుకను తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను ఎస్సై సుబ్బారావు పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించి ట్రాక్టర్ యజమానులపై కేసు నమోదు చేసినట్లు చెన్నూర్ పట్టణ సీఐ దేవేందర్‌రావు తెలిపారు.